మహిళలు ఆత్మస్థైర్యంతో సాగాలి: మంత్రి సీతక్క


శిక్షణలో పాల్గొన్న మహిళా నాయకులతో మంత్రి సీతక్క తదితరులు

కీసర: మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లినప్పుడే సాధికారిక సాధ్యం అవుతుందని మంత్రి సీతక్క అన్నారు. కీసర మండలం రాంపల్లిదాయరలోని బాల వికాస్‌లో తెలంగాణ ఇందిరా ఫెలోషిప్ వర్క్‌షాప్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సామాజిక ప్రభావం కోసం ఆచరణాత్మక నైపుణ్యాలతో సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... భవిష్యత్తు తరాల అభివృద్ధి మహిళలపైనే ఆధారపడి ఉందన్నారు. మహిళల్లో వైవిధ్యమైన నాయకత్వ లక్షణాలు ఉంటాయని, నిర్దిష్టమైన లక్ష్యంతో ముందుకెళ్లాలని సూచించారు. నాయకురాలు డాక్టర్ సల్లసాజన్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి గోదాసు పృథ్వీ, యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ వంగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ ఇబ్రహీంపట్నం గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమల వేసి నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ తెలుగు శాఖ అధ్యక్షురాలు దాసోజు పద్మావతి హాజరై విద్యార్థులకు కథల పుస్తకాలు, సాహితీ సంబంధమైన సమాచారంతో కూడిన పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు కానీ మాతభాష తెలుగును మరిచిపోవద్దన్నారు. భాష అంటే మన శాశ్వత చిరునామా, మన సంస్కృతి అని అన్నారు.

బీజేపీ సభ్యత్వాన్ని ముమ్మరం చేయాలి

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ జిల్లాలో పెద్ద ఎత్తున బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ పట్టణంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో ఉమ్మడి మండల పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్త బీజేపీ సభ్యత్వం పొందేలా నాయకులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ బోడ శ్రీనివాస్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు జగన్‌గౌడ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, జాకట ప్రేమ్‌దాస్, అంజనేయులు, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి అర్జున్, నాయకులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 9వ డివిజన్ సంతోష్‌నగర్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 25 లక్షలతో కార్పొరేటర్ శారదామనోధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మేయర్ శాంతి సమక్షంలో గురువారం భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ శాంతి మాట్లాడుతూ... జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ నవీన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, నాయకులు బుజ్జి, దయాకర్‌చారి, బహదూర్ అలీ, భిక్షపతిగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పచ్చదనంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి


మొక్కలు నాటుతున్న ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ కమల్ పి పట్నాయక్ తదితరులు

ఆర్‌బీఐ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ కమల్ పీ పట్నాయక్

కీసర: విద్యార్థులందరూ మొక్కలను నాటి సంరక్షించడం ద్వారా దేశ ప్రజల ఆయురారోగ్యాలను పెంచాలని ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ (హైదరాబాద్) కమల్ పి.పట్నాయక్ అన్నారు. ఆర్‌బీఐ స్థాపించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా గురువారం 90 మొక్కలను నాటే కార్యక్రమంలో భాగంగా రాంపల్లిలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లోని ఆర్గానిక్ గార్డెన్‌లో మొక్కలను నాటే పైలెట్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా తమ వంతు బాధ్యతను నిర్వహించడానికి పాఠశాల నుంచే ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని రిజ్వర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మంచి లక్ష్యంతో ముందుకొచ్చిందన్నారు. విద్యార్థులు మొక్కలను నాటే యజ్ఞాన్ని ఒక బాధ్యతగా స్వీకరించాలన్నారు. జూబ్లీహిల్స్ సంస్థల డైరెక్టర్ ఎం.వరలక్ష్మి మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ బాధ్యతను పెంచడం కోసం ఇటువంటి కార్యక్రమాలు దోదహం చేస్తాయన్నారు. విద్యార్థులందరితో కలిసి పాఠశాల ఆర్గానిక్ ఆవరణలో 90 మొక్కలను నాటి పర్యావరణ రక్షణ కోసం శపథం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి.పద్మజారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ షట్టర్ల నిర్మాణాలను ఆపాలి


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

బోడుప్పల్: చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణంలో అక్రమంగా నిర్మిస్తున్న షట్టర్లను ఆపాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం కమిషనర్ రామలింగం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చకిషన్ మాట్లాడుతూ... చెంగిచర్ల ప్రధాన రహదారిలో ఉన్న విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణంలో స్కూల్ వాతావరణం దెబ్బతినే విధంగా షట్టర్లను నిర్మిస్తున్నారన్నారు. మాస్టర్‌ప్లాన్‌లో 100 అడుగుల రోడ్డు ఉండగా, దానికి విరుద్ధగా నిర్మిస్తున్నారన్నారు. నగర పాలక సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా 11 షట్టర్లు నిర్మిస్తున్నారని, వాటిని వెంటనే ఆపాడాలన్నారు. నిర్మాణాలు ఆపని ఎడల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఈకార్యక్రమంలో మేడిపల్లి మండల మహిళా సమాఖ్య కార్యదర్శి సిహెచ్ మాధవి, మహాలక్ష్మి, భూతం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

'అధికారుల తీరుపై న్యాయపోరాటం చేస్తాం'

కుషాయిగూడ: కనీస సమాచారం లేకుండా సొంత స్థలంలోని కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేయడం దారుణమని ములుగు రుక్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కుషాయిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాప్రా మండల పరిధిలో తమకు సంబంధించిన భూముల్లో 507 ఎకరాల స్థలాన్ని 1996లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎన్ఎఫ్‌సీకి విక్రయించామని, అందులో 108 ఎకరాలు ఎన్ఎఫ్‌సీ తిరిగి అప్పగించింద తెలిపారు. నాటి నుంచి ఆ స్థలం తమ ఆధీనంలోనే ఉందని చెప్పారు. ఈ భూమిపై తమకు పూర్తి హక్కులు ఉన్నా రెవెన్యూ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ స్థలంలో నిర్మించిన కట్టడాలు కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాప్రా మండల రెవెన్యూ అధికారుల తీరుపై న్యాయపోరాటం చేస్తామని వెల్లడించారు.

ప్రతి పౌరుడూ పోలీస్‌గా భావించాలి

- డ్రగ్స్ రహిత మేడ్చల్‌గా తీర్చిదిద్దాలి
- పోలీసులతో యువత మమేకం కావాలి
- అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలి
- మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి


వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్‌రూరల్: యువకులంతా ఎవరికి వారే తాము పోలీసుగా భావించి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా మేడ్చల్ జోన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌కు గురువారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి కాసేపు సరదాగా వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... ప్రతి పౌరుడూ సమాజంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలను నిలువరించేందుకు పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. నేరాల నియంత్రణ కోసం యువత పోలీసులతో మమేకమవ్వాలన్నారు. మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాటిని నిలువరించేందుకు యువత వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధలు పాటించాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు సంభవించిన సమయంలో ప్రజల సహకారం లేక విలువైన ప్రాణాలు పోతున్నాయని ప్రజలు స్పందించి వారికి సాయం అందించాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు గతంలో నగరంలో ఉండగా నెమ్మదిగా గ్రామాలకు విస్తరిస్తున్నాయన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడుతున్నారని వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత యువతపైనే ఉందన్నారు. మేడ్చల్‌ను డ్రగ్స్ రహిత మేడ్చల్‌గా మార్చేందుకు కృషి చేయాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రించవచ్చని ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు యువత అండగా నిలవాలన్నారు. ప్రస్తుతం చిన్నారులు, యువకులు క్రీడలకు దూరమై సెల్‌ఫోన్ల బారిన పడుతున్నారని, ఆడిన కొందరు క్రికెట్‌కు పరిమితం అవుతున్నారని ప్రతి ఒక్కరూ శారీరకంగా దృఢంగా ఉండాలంటే క్రీడల్లో పాల్గొనాలని, యువత ఇతర క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. రానున్న గణేశ్ ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ముగిసేలా యువత సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డీఐ వెంకట్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో గురువారం ఓరియెంటేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఫర్ ఉమెన్స్, ఎమ్మార్ సెట్, కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఓరియెంటేషన్ డే కార్యక్రమాల్లో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకు సాగితే భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో నిలవవచ్చాన్నారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల సావినార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఎమ్మార్‌జీఐ డైరెక్టర్ శాలినీరెడ్డి, మల్లారెడ్డి యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి


మొక్కలు నాటుతున్న కమిషనర్, కౌన్సిలర్లు

మేడ్చల్‌రూరల్: ప్రకృతిని సంరక్షిస్తేనే అవి మనల్ని కాపాడుతాయని అందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ స్వామి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని ఏజీ కాలనీలో వన మహోత్సవంలో భాగంగా కౌన్సిలర్లు అమరం సరస్వతి, మల్లికార్జున్ ముదిరాజ్‌తో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఇంటర్ స్కూల్స్ కాంపిటేషన్స్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతీయ స్పోర్ట్ డే పురస్కరించుకుని చెంగిచర్లలో విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల, సెయింట్ పాల్స్, శ్రీవిద్యాజ్యోతి హైస్కూల్ ఈపోటీల్లో పాల్గొన్నట్లు వెల్లడించారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, ఖోఖో పోటీల్లో సెయింట్ పాల్స్ స్కూల్ ప్రథమ స్థానంలో నిలచింది. కార్యక్రమంలో విద్యాజ్యోతి పాఠశాల డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, సెయింట్ పాల్స్ స్కూల్ కో ఆర్డినేటర్ రవీంద్ర నాయక్, శ్రీవిద్యా జ్యోతి పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఉషాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.


కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నైపుణ్యాభివృద్ధితో మెరుగైన ఉపాధి అవకాశాలు

ఘట్‌కేసర్: వ్యక్తిగత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, అందుకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైదరాబాద్ జేఎన్టీయూ ఈసీఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆశారాణి అన్నారు. గురువారం మున్సిపాలిటీ కొండాపూర్ సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌కు గౌరవ అతిథి ఎడీఆర్ఐఎన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నోవాలిన్ జాకబ్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు గమ్యం చేరుకోవడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. సంస్కృతి కళాశాలల చైర్మన్ ఎ.వి.రమణారెడ్డి, కార్యదర్శి మల్లాది రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ... కళాశాలలో అవగాహనన సదస్సులు, వివిధ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ అభిషేక్, కళాశాల హ్యుమానిటీస్ అండ్ సైన్సెస్ హెచ్ఓడీ రాజేశ్వర్‌రెడ్డి, కళాశాల సలహాదారుడు బాగ్యరాజ్, టీపీఓ నీలంసింగ్, విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు


పల్లకి మోస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, భక్తులు

ఘట్‌కేసర్: భువనగిరి త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఘట్‌కేసర్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలాజీనగర్‌లో ఈ నెల 26న ప్రారంభమైన కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా భగవద్గీత పారాయణం చేస్తు స్వామి వారిని పుర వీధుల్లో ఊరేగించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ యాదవ్, జంగయ్యయాదవ్ దంపతులు, కౌన్సిలర్ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ సైదులు హాజరై పల్లకి మోశారు. కార్యక్రమంలో శంకర్, దేవేందర్, లక్ష్మీనారాయణ, శివరామ, కష్ణ, బుచ్చిబాబు, రామకష్ణ, నరసింహ, కుమార్, రాజేశ్వరీ, లలిత, జయమ్మ, ఏఎస్ఐ మహేందర్, పవన్‌చారి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో పెద్ద ఎత్తున మున్సిపల్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు ఆర్ఎల్ నగర్ కాలనీలో సుమారు రూ. 5 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ బుద్ధవరం లక్ష్మీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: మండలంలోని మెడిసిటీ ఫీడర్ పరిధిలో చెట్ల తొలగింపు, విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సామ్‌సంగ్ గోదాం, దివ్య ఆగ్రో, ఫాక్స్ లైఫ్ సైన్సెస్, కందన్ వాల్, హిందుస్థాన్ మెగ్నీషియం, మరినో కంపెనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్‌లో పలువురి చేరిక


యూనియన్‌లో చేరిన వారితో శంకర్‌రావు, రవీందర్

ఘట్‌కేసర్: సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్‌లో పలువురు ఎస్సీ, ఎస్టీ కార్మికులు ఘట్‌కేసర్‌లో చేరారు. ఘట్‌కేసర్ పట్టణంలో గురువారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.శంకర్‌రావు, కార్యదర్శి రవీందర్ హాజరై కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఎస్సీ, ఎస్టీ కోశాధికారి శ్రీకాంత్, విజయ్‌కుమార్ రంజన్, సభ్యుడు సంతోశ్ తదితరులు ఘట్‌కేసర్ శాఖలో చేరగా బ్రాంచ్ చైర్మన్ విజయ్‌కుమార్, కార్యదర్శి బి శ్రీనివాస్, ఆఫీస్ బేరర్స్ ప్రవీణ్‌కుమార్, హరికృష్ణ, ఎ.శ్రీనివాస్, కిరణ్, అన్నపూర్ణ, వెంకటేశ్వర్లు, వేణు, అశోక్, భాస్కర్ పాల్గొన్నారు.

ఉద్యోగం కోసం వెళ్లిన యువకుడి అదృశ్యం


భానుప్రకాశ్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఉపాధి కోసం నగరం వెళుతున్నానని చెప్పిన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శేఖర్ సమాచారం మేరకు... మున్సిపాలిటీలోని చందుపట్లగూడ గ్రామానికి చెందిన కంభం భానుప్రకాశ్‌రెడ్డి(24) బీటెక్ చదివి రెండేళ్లుగా ఇంటి వద్ద ఉంటున్నాడు. రెండు నెలల క్రితం నగరం వెళ్లి ఏదైన ఉద్యోగం చూసుకుంటాను, హాస్టల్‌లో గానీ, స్నేహితుల ఇంటిలో కానీ ఉంటానని చెప్పి వెళ్లిపోయాడు. అనంతరం ఆగస్టు 25, 2024న అర్ధరాత్రి 1 గంటకు ఇంటికి వచ్చి వచ్చాడు. నడుచుకుంటూ ఎందుకు వచ్చావని బైక్, ల్యాప్‌టాప్ ఏమయ్యాయని తల్లితండ్రులు అడిగారు. డబ్బుల కోసం కుదువపెట్టానని డబ్బులిస్తే తీసుకొని వస్తానని తెలిపాడు. తల్లితండ్రులు డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో సమాచారం ఇవ్వకుండా ఇంటి లోంచి వెళ్లిపోయాడు. అనంతరం ఫోన్ స్వాచాఫ్ చేశాడు. బంధువులు తెలిసిన ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి భాస్కర్‌రెడ్డి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

రేపు ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌తో... 'సాక్షి' ఫోన్ ఇన్

ఘట్‌కేసర్: డెంగీ, మలేరియా తదితర వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ సాబేర్‌అలీతో 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో శనివారం 'ఫోన్ ఇన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నాము. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు కమిషనర్ ఫోన్‌లో ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఫోన్: 91540 83769లో సంప్రదించాలి.

విద్యుత్ లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్ బీ1 కాలనీలో రూ. 6 లక్షల విద్యుత్ సంస్థ నిధులతో 100 కేవీ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీ, విద్యుత్ ఏఈ సతీశ్‌కుమార్ హాజరై ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించామన్నారు. ఎక్కడైనా లో ఓల్టేజీ సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ


పుస్తకాలను అందజేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని ప్రజలకు, యువతకు, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేలా గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపల్ బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి శైలజ పుట్టిన రోజు సందర్భంగా ఆమె గ్రంథాలయానికి పుస్తకాలను గ్రంథాలయ ఇంచార్జ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... గ్రంథాలయంలో విజ్ఞానాన్ని పెంపొందించే ఎన్నో అద్భుతమైన పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు.

క్రీడాకారుల ఎంపిక


జోనల్ క్రికెట్‌కు ఎంపికైన క్రీడాకారులు

మేడ్చల్: మేడ్చల్ జోనల్ క్రికెట్‌కు గురువారం క్రీడాకారులను ఎంపిక చేశారు. పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లోని క్రికెట్ అకాడమీలో నిర్వహించిన సెలక్షన్స్‌లో జోనల్ కార్యదర్శి వెంకటనారాయణ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికలో పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామలింగేశ్వరుడి కల్యాణోత్సవం

కీసరగుట్ట దేవాలయంలో స్వామివారి కళ్యాణోత్సవం


రామలింగేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు

కీసర: శ్రావణమాసోత్సవ ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో భాగంగా గురువారం కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో విశేష పూజలను నిర్వహించారు. గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారికి ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని అర్చకులు కనులపండువగా నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకొని ఆలయ మండపంలో సత్యనారాయణ స్వామి వత్రాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మెట్రో స్టేషన్ల వద్ద ఫ్రీ పార్కింగ్ కొనసాగించాలి

ఉప్పల్: నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్లల్లో ఫ్రీ పార్కింగ్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, పీవైఎల్ యువజన సంఘాల ఆధ్వర్యంలో నాగోల్ మెట్రోస్టేషన్ వద్ద ప్రయాణికులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యవజన సంఘాల ప్రతినిధులు కల్లూరు ధర్మేంద్ర, సత్యప్రసాద్, వెంకటేష్, కె.ఎస్.ప్రదీప్ మాట్లాడుతూ... మెట్రో ప్రయాణికులకు పార్కింగ్ సౌకర్యాన్ని ఉచితంగా కల్పించాల్సిన బాధ్యత మెట్రో సంస్థదే అన్నారు. ప్రభుత్వ భూములను ఉచితంగా తీసుకుని వాటిల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా చార్జీల పేరుతో దండుకోవాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. కేవలం నాగోల్, మియాపూర్ స్టేషన్లతో పాటు మిగిలిన అన్ని స్థలాల్లో పార్కింగ్ ఫీజును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద కూడా సంతకాల సేకరణ పూర్తయిన తరువాత మెట్రో ఎండీకి వినతి పత్రంతో పాటు ప్రయాణికుల నుంచి సేకరించిన సంతకాల పత్రాలను సమర్పిస్తామని తెలిపారు. అప్పటికీ సమస్య పరిష్కరించకుంటే చలో నాగోల్ పేరిట ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో శేఖర్, గిరిబాబు, రాజ్‌కుమార్, రవి, మాజిద్ అలిఖాన్, కళ్యాణ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.